సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



కందుకూరులో ఏసీబీ దాడులు

కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారుల ఆకస్మిక దాడుల్లో సబ్ రిజిస్ట్రార్ టేబుల్ డెస్క్‌లో రూ.41 వేల వరకు నగదు దొరికింది. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,566
3 శాతం జీఎస్టీతో	రూ.5,733
నవర (8 గ్రా)	రూ.45,864

గరిష్టం/కనిష్టం
35.6 /28.0

వాతావరణం

బుధవారం గాలిలో 55 శాతం తేమ ఉంది. గురువారం వాతావరణంలో మార్పులు ఉండవు. ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



సుబ్బారెడ్డిని ఆహ్వానిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కె.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానించారు. ఆయన బుధవారం వారిని కలిసి ఆహ్వానపత్రాలు అందజేశారు. మే నెల ఒకటి ఏడో తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

ముగిసిన పది మూల్యాంకనం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసింది. నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికలు, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 19వ తేదీన ఈ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 2.10 లక్షల జవాబుపత్రాలను మూల్యాంకనం చేశారు. చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు తదితరులు మొత్తం 1,500 మందికి అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓఎంఆర్‌లో పార్ట్–సీ పత్రాలను బండిల్స్ చేసి ఏ రోజు కారోజు విజయవాడలోని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు పంపించారు. అక్కడ మార్కుల వివరాలను ఆన్‌లైన్లో పొందుపరుస్తారు. డీఈఓ గంగాభవాని ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు.

హామీలు నెరవేర్చేందుకు చర్యలు

నెల్లూరు(బారకాసు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న శంకరన్ హాల్లో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు సంబంధించి అనుమతులు, నిధుల కోసం ప్రజాప్రతినిధుల సహకారంతో రాష్ట్రస్థాయి అధికారులతో సంప్రదించాలని చెప్పారు. సీఎం, సంబంధిత శాఖల సెక్రటరీలు హామీలపై సమీక్షలు చేస్తున్నారని, పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిపాదనలు పంపితే అవి ఏ స్థాయిలో ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. సీపీఓ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, సీపీఓ రాజు, డీఎఫ్ఓ చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రెండో మోడల్ కార్గో టెర్మినల్ ప్రారంభం



బీపీసీఎల్ గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో పరిధిలో నెల్లూరు కృష్ణపట్నం వద్ద భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌ను రైల్వే అధికారులు బుధవారం ప్రారంభించారు. పరిశ్రమల నుంచి పెట్టుబడులు పెంచేందుకు భారతీయ రైల్వే జీసీటీ పాలసీని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో కొత్త టెర్మినల్స్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఇప్పటికే నిర్మాణంలో ఉన్నవి, ప్రయివేట్ సైడింగ్స్, టెర్మినల్స్‌ను గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్స్‌గా మారుస్తున్నారు. ట్రాక్, సిగ్నల్ అండ్ టెలీ కమ్యూనికేషన్, ఓవర్ హెడ్ పరికరాలు, జీసీటీ వద్ద నియమించిన కమర్షియల్ సిబ్బంది ఖర్చులు రైల్వే భరిస్తుంది. రైల్వే భూమిలో నిర్మించిన జీసీటీల వద్ద నిర్వహించే ప్రయివేట్ యాజమాన్యంలోని వ్యాగన్ల రేక్‌ల కోసం ఎటువంటి టెర్మినల్స్ చార్జీలు విధించరు. ఈ మేరకు బుధవారం విజయవాడ డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు బీపీసీఎల్ ప్రతినిధులతో నెలకు 20 క్‌ల పెట్రోలియం ఆయిల్, లూబ్రికెంట్‌ల రవాణను 35 ఏళ్ల కాలానికి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ టెర్మినల్స్ ద్వారా సరుకు రవాణాలో కొత్త మార్గాలను అభివృద్ధి చేయడంలో కృషి చేసిన సీనియర్ డీసీఎంను డీఆర్ఎం షివేంద్ర మోహన్ అభినందించారు.

ఇంటర్‌లో మన స్థానం 4

- ఫస్టియర్‌లో 67 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్‌లో 77 శాతం
- ఫలితాల్లో బాలికల హవా

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో జిల్లా నాలుగో స్థానంలో నిలవడం గమనార్హం. కాగా ఉత్తీర్ణతలో బాలికల హవా కనిపించింది. పరీక్షలు గత నెల 15 నుంచి ఈనెల 4వ తేదీ వరకు జరిగాయి. తక్కువ వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేయడంపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రథమ సంవత్సరానికి సంబంధించి 67 శాతం, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 77 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- ఫస్టియర్‌లో 25,535 మంది పరీక్షలకు హాజరు కాగా 17,042 మంది పాసయ్యారు.
- సెకండియర్‌లో 22,789 మంది పరీక్షలు రాయగా 17,438 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ప్రథమ సంవత్సరంలో 13,083 మంది బాలురు పరీక్షలు రాయగా 8,445 మంది పాసయ్యారు. 65 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- 12,452 మంది బాలికలు పరీక్షలు రాయగా 8,597 మంది పాసయ్యారు. 69 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- ద్వితీయ సంవత్సరంలో 11,401 మంది బాలురు పరీక్షలు రాయగా 8,422 మంది ఉత్తీర్ణులయ్యారు. 74 శాతం నమోదైంది.
- 11,388 మంది బాలికలు పరీక్షలు రాయగా 9,016 మంది పాసయ్యారు. 79 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగింది.

మేనేజ్‌మెంట్ల వారీగా పరిశీలిస్తే..

- ప్రథమ సంవత్సరంలో జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు 87.91 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానం, 70.27 శాతం ఉత్తీర్ణతతో ఏపీఆర్‌జేసీ ద్వితీయ స్థానం, 66.47 శాతం ఉత్తీర్ణతతో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ తృతీయ స్థానంలో నిలిచాయి.
- ద్వితీయ సంవత్సరంలో జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ విద్యార్థులు 92.21 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానం, 81.56 శాతం ఉత్తీర్ణతతో ఏపీఎస్ డబ్ల్యూఆర్ ద్వితీయ స్థానం, 80.72 శాతం ఉత్తీర్ణతతో ఏపీఆర్‌జేసీ తృతీయ స్థానం సాధించాయి.

వచ్చేనెల నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు వచ్చేనెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇవి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. ఫెయిలైన వారితోపాటు ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్షలు రాసేందుకు వీలు కల్పించారు. ప్రాక్టికల్స్ జూన్ 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తారు. పరీక్ష ఫీజు వచ్చేనెల 3వ తేదీలోపు ఆయా కళాశాలల్లో చెల్లించాల్సి ఉంటుంది. ప్రథమ సంవత్సర, ద్వితీయ సంవత్సర విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు వచ్చేనెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రతిభ

ప్రభుత్వ కాలేజీల్లో చదువుకున్న విద్యార్థులు ఫలితాల్లో ప్రతిభ చూపారు. చేజర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ సీనియర్ ఇంటర్ విద్యార్థి అజిత్‌కుమార్ ఎంపీసీలో 969 మార్కులు, సంగం గురుకుల కళాశాలలో ఎంపీసీలో మమత 966, బైపీసీలో హర్షిత 971, నెల్లూరులోని డీకే డబ్ల్యూ కళాశాలలో ఎంపీసీ చదువుతున్న కె.స్వాతి 978, జాస్మిత 970 మార్కులు సాధించారు.



అజిత్‌కుమార్ హర్షిత మమత స్వాతి జాస్మిత



ఇటీవల నెల్లూరులో పరీక్షలు రాసి విజయకేతనం చూపుతున్న విద్యార్థినులు

ఉత్తీర్ణత శాతం		
సంవత్సరం	బాలికలు	బాలురు
ఫస్టియర్	69	65
సెకండియర్	79	74

ఎనిమిదేళ్ల ఫలితాలిలా..		
ప్రథమ సంవత్సరం		
సంవత్సరం	శాతం	రాష్ట్రంలో స్థానం
2015-16	71	3
2016-17	69.29	2
2017-18	64	4
2018-19	57	3
2019-20	ఆల్‌పాస్	
2020-21	ఆల్‌పాస్	
2021-22	58	4
2022-23	67	4
ద్వితీయ సంవత్సరంలో		
2015-16	78	2
2016-17	80.49	2
2017-18	77	2
2018-19	74	3
2019-20	ఆల్‌పాస్	
2020-21	ఆల్‌పాస్	
2021-22	67	3
2022-23	77	4

రాజ్యసభలో హుందాగా వ్యవహరించా



బీఎస్సార్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న వెంకయ్యనాయుడు, రాజమోహన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి తదితరులు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఆత్మకూరు: 'ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు రాజ్యసభలో హుందాగా వ్యవహరించా. సభను సజావుగా నిర్వహించానన్న తృప్తి ఉంది.' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలపై ప్రజలకు అయిష్టత పెరుగుతోందని, ఇది మంచి పరిణామం కాదన్నారు. ధనాన్ని, కులాన్ని కాకుండా నాయకుల గుణాన్ని చూసి ఓట్లు వేసి చట్టసభలకు పంపించాలన్నారు. భవిష్యత్‌లో భారతదేశం ప్రపంచానికే గురువు అవుతుందన్న విషయంలో ఎలాంటి అనుమానం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాధు కరుణకుమారి, పలు పార్టీల నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేందర్‌రెడ్డి, జి.కన్నబాబు, కుడుముల సుధాకర్‌రెడ్డి, కె.సుధాకర్, జి.మునిరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ బీఎస్సార్ వివాదరహితుడు

సుందరరామిరెడ్డి వివాదరహితుడని వెంకయ్యనాయుడు అన్నారు. దివంగత డాక్టర్ బీఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ ఆత్మకూరు పట్టణంలో బుధవారం జరిగింది. దీనికి విశిష్ట అతిథిగా వెంకయ్యనాయుడు విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్సార్, తాను ఒకేసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ్యులుగా కొనసాగామన్నారు. పార్టీలు వేరైనా సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఇటీవలి కాలంలో భారత పార్లమెంట్‌లోనూ సంప్రదాయాలు కొరవడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు అభివృద్ధిలో పోటీ పడాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్, సుందరరామిరెడ్డి కుమారుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, డాక్టర్ బి.రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇంకా బొల్లినేని కృష్ణయ్య, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కంచర్ల శ్రీహరినాయుడు, సీవీ శేషారెడ్డి, పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

డీఎస్పీల బదిలీలు



రామచంద్ర శిరీష

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని కందుకూరు డీఎస్పీగా తిరుపతి జిల్లా రేణిగుంట డీఎస్పీగా పనిచేస్తున్న ఎ.రామచంద్ర, విశాఖపట్నం హార్బర్ ఏసీపీ ఎస్.శిరీష నెల్లూరులోని పోలీస్ శిక్షణ కేంద్రం (డీపీటీసీ) డీఎస్పీగా నియమితులయ్యారు. రెండు, మూడురోజుల్లో వీరు బాధ్యతలు చేపట్టనున్నారు.

1991 సంవత్సరంలో..

అనంతపురం జిల్లాకు చెందిన ఎ.రామచంద్ర 1991లో పోలీస్ శాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. 2001లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది మైదుకూరు, బద్వేల్‌లో పనిచేశారు. 2014లో ఉద్యోగోన్నతి పొంది కర్నూలు ట్రాఫిక్ డీఎస్పీగా, అనంతపురం ఎస్‌బీ డీఎస్పీగా, తిరుపతి జిల్లా రేణిగుంట డీఎస్పీగా పనిచేశారు.

తొలుత ఇంజినీర్‌గా..

కర్నూలు పట్టణానికి చెందిన ఎస్. శిరీష బీటెక్ చదివారు. నెల్లూరు టీపీసీఎల్‌లో ఏడాదిన్నర కాలం పాటు ఇంజినీర్‌గా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యారు. 2018లో గ్రూప్ వన్‌లో ఉత్తీర్ణురాలై డీఎస్పీగా పోలీస్ శాఖలో బాధ్యతలు చేపట్టారు. విశాఖ, విజయనగరం జిల్లా ఎస్ కోటలో ట్రైనీ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. తొలి పోస్టింగ్ విశాఖపట్నం హార్బర్ ఏసీపీగా పనిచేశారు. ఆమెకిది రెండో పోస్టింగ్.

వాసవీమాతకు పట్టుచీర సమర్పణ



పట్టుచీరను ప్రదర్శిస్తున్న ద్వారకానాథ్, ఆలయ కమిటీ సభ్యులు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి వాసవి అలంకారంలో కొలువైన అమ్మవారికి నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఆదిలక్ష్మీకుమారి దంపతులు సిరిసిల్లలో ప్రత్యేకంగా చేయించిన అగ్గిపెట్టెలో పట్టే పట్టు చీరను సమర్పించారు. అమ్మవారి ఎదుట పట్టుచీరను ఆవిష్కరించారు. నిజరూప దర్శనంలో కొలువైనకన్యకాపరమేశ్వరికి సాధు నరసింహారావు, శ్రీనివాసులు, యశ్వంత్ కుటుంబసభ్యులు అమ్మవారికి నాలుగు కిలోల వెండి కలశం, తాంబూల పళ్లెం ప్రత్యేకంగా చేయించి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

సోమశిలలో 51.448 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 51.448 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 200 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

1498 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 663 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ తెలిపారు.

- ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో 835 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు.

పేద విద్యార్థులకు వరం 'వసతి దీవెన'

- ఉన్నత చదువులకు సీఎం వైఎస్ జగన్ భరోసా
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- జగనన్న వసతి దీవెన నిధుల విడుదల
- జిల్లాలో అర్హులు 48,282 మంది



విద్యార్థినులకు మెగా నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారు. పేద విద్యార్థుల కోసం జగనన్న వసతి దీవెన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అనంతపురం జిల్లా నార్పల వేదికగా బుధవారం వసతి దీవెన నిధులను సీఎం విడుదల చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, విద్యార్థులు, తల్లితండ్రులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పథకానికి జిల్లాలో 48,282 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వారికి రూ.46.98 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందజేశారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. తండ్రి స్ఫూర్తితో తనయుడు విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యార్థులు సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నత చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. తొలుత మెగా నమూనా చెక్కును ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థులు, తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కనకదుర్గాభవాని, ఐటీడీఏ అధికారి పరిమళ తదితరులు పాల్గొన్నారు.

ఎంతో ఉపయోగం



నాకు ఇద్దరు పిల్లలు. భర్త లారీ డ్రైవర్. మా పాప జ్ఞానదీపిక డిగ్రీ చదువుతోంది. పాప హాస్టల్ ఫీజులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా జగనన్న వసతి దీవెన పథకం కింద అకౌంట్లో డబ్బులు పడ్డాయి. పేద పిల్లల చదువులకు ఈ డబ్బు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలాంటి ముఖ్యమంత్రి ఉన్నంత కాలం మాలాంటి వారికి ఆర్థిక ఇబ్బందులు ఉండవు. – మోపూరు రేవతి, పడారుపల్లి

గతంలో ఎవరూ సాయం చేయలేదు



సీఎం అందరికీ మంచి చేస్తున్నారు. నా బిడ్డ మేఘనను డిగ్రీ చదివిస్తున్నానంటే ఆయన ఇచ్చే పథకాలే కారణం. గతంలో ఎవరు కూడా మాకు ఈ విధంగా డబ్బు అందించి సాయం చేయలేదు. పేదవారి గురించి ఆలోచన చేసి సాయం చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. – కొత్తపల్లి సుబ్బమ్మ, సంతపేట, నెల్లూరు

క్లుప్తంగా

ఇంటర్ ఫలితాల్లో 'నారాయణ' విజయకేతనం



నెల్లూరు (టౌన్) : ఇంటర్ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. హరనాథపురంలోని కళాశాలలో విద్యార్థులను బుధవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎంపీసీలో రిషిత, నిత్యశ్రీ 989, రమ్య, వేణుమాధవ్, తేజేష్ 988 మార్కులను సాధించారన్నారు. బైపీసీలో సాయికిరణ్ 987 మార్కులను సాధించారని చెప్పారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఆశ్రిత, స్రవంతి, నిమిషా శ్రీసాయి 466, బైపీసీలో మైత్రి 434 మార్కులను సాధించారని వివరించారు.

'ఓవెల్' జయభేరి



శరణ్య

నెల్లూరు (టౌన్) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఓవెల్ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారని కళాశాల డైరెక్టర్ వేణు తెలిపారు. స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షయ శరణ్య 981, దీక్షితారెడ్డి 974, జాహ్నవి 963 మార్కులు సాధించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరంలో హారిక 416, మన్‌ప్రీత్ 458 మార్కులు సాధించారన్నారు. కళాశాల సీఈఓ ప్రమీల, ఏజీఎం మహదేవన్, ఏజీఎం గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

సత్తాచాటిన 'విశ్వసాయి'



రాహుల్‌ఈశ్వర్



నాగయశస్విని



సుమంత్



శివజ్యోతి

నెల్లూరు (టౌన్) : ఇంటర్ ఫలితాల్లో విశ్వసాయి కళాశాల విద్యార్థులు సత్తాచాటారని కళాశాల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక మాగుంట లేఅవుట్‌లో ఉన్న కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అంజన 464, నవీన్‌కుమార్, రుషితారెడ్డి 463 మార్కులు, బైపీసీలో దివ్య, సాయి హర్షిత 435, యశ్వంత్‌కుమార్ 434 మార్కులు, ఎంఈసీలో గుఫ్రాన్ 489, విష్ణు 485 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సుమంత్ 987, శివజ్యోతి, సాయియశస్వి 986, మోనిషా, శిశిర్‌రెడ్డి, తనుశ్రీలు 985, బైపీసీలో రాహుల్‌ఈశ్వర్, సుష్మ 987, నాగయశస్విని, జాహ్నవి 986, ఎంఈసీలో రుష్మిత 953 మార్కులు సాధించారన్నారు.

'శ్రీచైతన్య' విజయదుందుభి



నెల్లూరు (టౌన్) : ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల డీన్ శ్రీరామ్ తెలిపారు. స్థానిక కళాశాలలో విద్యార్థులకు అభినందన సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎంపీసీలో గజ్జెల శైలశ్రీ 987, శ్రీరామ్ 986, సౌమ్య, అమీష్ 985, బైపీసీలో ఆష్యా 985 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో యజ్ఞశ్రీ, అకీబాబాను 464, వంశింథ్, నిత్యశ్రీ, కీర్తన, రవిచరణ్, కోమాల్య 463 మార్కులు, బైపీసీలో శివహారిక, లాస్య చౌదరి 432 మార్కులు సాధించారన్నారు. 460 మార్కులకు పైగా 26 మంది, 450కు పైగా 140 మంది సాధించారన్నారు.

మహా కుంభాభిషేకం..
సర్వపాప హరణం

- నేటి నుంచి ఉత్సవాలు
- వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



మహాకుంభాభిషేక వేడుకలకు ముస్తాబైన కామాక్షితాయి ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధి చెందిన జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మొదటిసారి 1969లో కుంభాభిషేక వేడుకలను నిర్వహించారు. రెండోసారి 2008లో కంచి కామకోటి పీఠాధిపతులైన జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి స్వాముల చేతుల మీదుగా జరిగింది. 15 ఏళ్ల తరువాత ఈ ఏడాది కంచికామకోటి పీఠాధిపతులైన విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా నిర్వహిస్తున్నారు.

సప్త నదుల జలాలతో..

దేశ వ్యాప్తంగా ఐదు చోట్ల ఉండే కామాక్షితాయి అమ్మవార్లలో జొన్నవాడలోని ఆలయం మూడోదిగా ప్రసిద్ధి చెందింది. ఈ మహాకుంభాభిషేక వేడుకల్లో దేశంలోని సప్తనదుల నుంచి జలాలను తీసుకొచ్చి వాటి ద్వారా దేవతల శక్తులను ప్రేరేపించి, హోమ పూజ చేసి కలశాల్లో సప్త నదుల నుంచి తెచ్చిన జలాలను నింపి వాటిలో అమ్మవారి కళలను ఆవహింప చేస్తారు. అలా కుంభంలో ఉంచిన జలాలను ఆలయం పై ఉన్న శిఖరం వద్దకు తీసుకెళ్లి అక్కడ అభిషేకం చేయడంతో పాటు ఆలయంలో కొలువైన అమ్మవారికి, స్వామివారికి అభిషేకం చేస్తారు. అంతే కాకుండా శిఖరాన్ని అభిషేకం చేసే సమయంలో ఆ జలాలను ప్రజలపై చల్లడంతో పునీతులవుతారని నమ్మకం. ఈ కార్యక్రమాలకు దాతలుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కొలన్ రాజారెడ్డి-పూజిత దంపతులు వ్యవహరిస్తుండగా, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొననున్నారు.

కార్యక్రమాలివే..

27న గణపతి హోమం, 28న మహా సంకల్పం, అంకురార్పణ, 29న దేవతా కళాకర్షణం, యాగశాల ప్రవేశం, లఘు పూర్ణాహుతి, 30న చండీ పారాయణ హోమం, మే 1న గణపతి పూజ, పుణ్యాహవచనం, మూల మంత్ర హోమం, 2న జపహోమం, తత్వ హోమం, యాగశాల వేదిక పూజ, 3న మహాకుంభాభిషేకం, వెండినంది సేవ గ్రామోత్సవం నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



నేటి నుంచి ఆలయ ఆవరణలో జరిగే మహా కుంభాభిషేక వేడుకలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దాదాపు 15 ఏళ్ల తరువాత నిర్వహించే వేడుకలు కావడంతో లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, తాగునీరు, మరుగుదొడ్ల వసతిని కల్పించాం. అంతే కాకుండా ప్రముఖులు కూడా వేడుకలను వస్తారు.

– పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఆలయ చైర్మన్

తరలిరండి



వారం రోజుల పాటు జరిగే కుంభాభిషేక వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పునీతులు కావాలి. చివరి మూడు రోజుల పాటు కంచికామకోటి పీఠాధిపతులు ఉండి వేడుకలను నిర్వహిస్తారు. సప్త నదుల జలాలతో జరిగే వేడుకల్లో భక్తులు పాల్గొని జలాలను చల్లించుకోవాలి.

– ప్రసాద్ స్వామి, అర్చకుడు

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించం

- కలెక్టర్ హరినారాయణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు) : స్పందన అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఆయన బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో వచ్చే సమస్యలపై అన్నిశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్దేశిత గడువులోగా పరిష్కార మార్గం చూపాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలని చెప్పారు. అర్జీలను పరిష్కరించకుండానే తప్పుడు సమాధానాలు, తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినతులను గడువులోపు పరిష్కరించే బాధ్యత హెచ్‌ఓడీలదే అని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే డిపార్ట్‌మెంట్‌లలో అధిక సంఖ్యలో అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలో స్పందన తరహాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని, ఒక ప్రత్యేక బృందం వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. అధికారులందరూ బాధ్యతగా వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి సచివాలయంలో స్పందన రిజిస్టర్లు నిర్వహించాలని తెలియజేశారు. వలంటీర్లు వారంలో మూడు రోజుల పాటు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు వారానికి నాలుగు సార్లు గ్రామ సచివాలయాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు అశోక్‌కుమార్, రంగవరప్రసాద్, ఇతర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాతకక్షలతోనే హత్య

- ముగ్గురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్) : స్నేహం ముసుగులో అదనుచూసి యువకుడిని హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను భగత్‌సింగ్‌కాలనీ వద్ద బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పాతకక్షల నేపథ్యంలో హత్యకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. ఈ మేరకు నవాబుపేట పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు కేసు వివరాలను వెల్లడించారు. జనార్దనరెడ్డికాలనీ రైలువీధిలో షేక్.మాబుల్లా(21) కుటుంబం నివాసం ఉంటోంది. అతను రెండేళ్ల కిందట క్రికెట్ ఆడుతున్న సమయంలో అదేప్రాంతానికి చెందిన షేక్.మాజ్ అలియాస్ మహమ్మద్ మాజ్‌తో గొడవ జరిగింది. అప్పటి నుంచి మాజ్ అతని తమ్ముడు షేక్.షాద్ అలియాస్ మహమ్మద్ షాద్‌లు మాబుల్లాపై కక్షపెంచుకున్నారు. ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. మాజ్, షాద్‌లు గత కొంతకాలంగా మాబుల్లాతో సన్నిహితంగా ఉంటూ అదను కోసం వేచి చూడసాగారు. ఈనెల 22న రాత్రి మాబుల్లా ఇంటికి షాద్ వచ్చాడు. పని ఉందని అతన్ని బైక్‌పై ఎక్కించుకుని దర్గావీధిలోకి తీసుకెళ్లారు. అప్పటికే అక్కడ మాజ్ అతని స్నేహితుడు షఫీ కత్తులతో ఉన్నారు. మాబుల్లాతో గొడవకు దిగి అతన్ని పొడిచి నిందితులు పరారయ్యారు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న మాబుల్లాను అతని తండ్రి, బావ బైక్‌పై ఎక్కించుకుని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందారని నిర్ధారించారు. మృతుని తండ్రి బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భగత్‌సింగ్‌కాలనీ వద్ద నిందితులు మాజ్, షాద్, షఫిలను అరెస్ట్‌చేసి హత్యకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు. రోజుల వ్యవధిలోనే హత్య కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎస్సై కె.తిరుపతయ్య వారి సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో ఎస్సై రెహమాన్ పాల్గొన్నారు.

కోటి కుటుంబాల దీవెన పొందాం



కోటి కుటుంబాలను కలిసిన సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి, ఇతర ప్రజాప్రతినిధులు

- ఏడు లక్షల మంది సైనికులతో ఇంటింటికీ వెళ్తున్నాం
- దేశ చరిత్రలో ఇది గొప్ప కార్యక్రమం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్) : దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా ఏడు లక్షల మంది సైనికులతో 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదంతో నేరుగా ప్రజల ముంగిటకే వెళ్తూ రాష్ట్రంలో ఇప్పటికే కోటి కుటుంబాల దీవెనలు పొందామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఇంటి ముంగిటకు వెళ్లిన సందర్భంలో గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు, ప్రస్తుతం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పాలన విషయాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోందని, ప్రభుత్వానికి దీవెనలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లినప్పుడు గతంలో జన్మభూమి కమిటీలతో వారు పడిన ఇబ్బందులు చెబుతున్నారని, ప్రస్తుత పాలనలో అర్హతే ప్రామాణికంగా అనేక సంక్షేమ పథకాలు అందుతున్నట్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

చంద్రబాబుకు ఇదేం ఖర్మ

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తీరుతో ప్రజలు విసిగిపోయి గత ఎన్నికల్లో ఇంట్లో కూర్చోబెట్టారని మంత్రి కాకాణి అన్నారు. కానీ బాబు మాత్రం బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టినా ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో, ఇదేం ఖర్మ రాష్ట్రానికి అంటూ తిరుగుతున్నాడన్నారు. కానీ ప్రజలు మాత్రం చంద్రబాబుకు ఇదేం ఖర్మ అనుకుంటున్నారని గుర్తు చేశారు. ఎల్లో మీడియాలో తప్ప టీడీపీ ప్రజల్లో లేదని తెలిసిపోయిందన్నారు. దొంగ సర్వేలతో పచ్చపత్రికలు, ఎల్లో మీడియాలో హడావుడి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం సహా మొత్తం 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి నేతలు ఆనం విజయకుమార్ రెడ్డి, పి.రూప్‌కుమార్, ముక్కాల ద్వారకానాథ్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, మందల వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో ఏసీబీ దాడులు

- సబ్‌రిజిస్ట్రార్ టేబుల్ డెస్క్‌లో దొరికిన రూ.41 వేలు
- ప్రస్తుతం సెలవులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ సుల్తాన్‌బాషా
- రాత్రి కూడా తనిఖీలు కొనసాగుతున్న వైనం

కందుకూరు: కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో నలుగురు సీఐలతో పాటు మొత్తం 11 మంది అధికారుల బృందం ఏకకాలంలో దాడులు చేసి మొత్తం కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సోదాల్లో సబ్‌రిజిస్ట్రార్ టేబుల్ డెస్క్‌లో రూ.41 వేల వరకు నగదు దొరికింది. అయితే ప్రస్తుతం సబ్‌రిజిస్ట్రార్ సెలవులో ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు. దీనిపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. సిబ్బంది మొత్తాన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో నగదు దొరికినట్లు సమాచారం. అలాగే పలువురు ప్రైవేట్ వ్యక్తులు కార్యకలాపాలను గుర్తించి అధికారులు వారిని కూడా నిర్బంధించారు. వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎంత మొత్తంలో నగదు పట్టుకున్నారో తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి పలువురి వద్ద నుంచి రూ.1.03 లక్షల వరకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీంతో పాటు భూముల రిజిస్ట్రేషన్‌లపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

విధుల్లో ప్రైవేట్ సిబ్బంది

కొందరు రిటైర్డ్ అధికారులతో పాటు, ప్రైవేట్ సిబ్బంది కార్యాలయంలో పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కార్యాలయంలో జరిగే నగదు లావాదేవీల వ్యవహారంలో వీరే ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు గుర్తించారు. మరికొందరు ప్రైవేట్ సిబ్బంది బుధవారం విధులకు రాలేదు. వీరిని కూడా గుర్తించిన ఏసీబీ అధికారులు వారి ద్వారా ఆన్‌లైన్ నగదు లావాదేవీలు ఏమైనా జరిగాయా అనే విషయాలను పరిశీలిస్తున్నారు.

పరారీలో డాక్యుమెంట్ రైటర్స్

ఏసీబీ దాడులతో డాక్యుమెంట్ రైటర్స్ పరారయ్యారు. తమ గదులకు తాళాలు వేసి పారిపోయారు. ప్రతిరోజు జరిగే రిజిస్ట్రేషన్‌ల వ్యవహారంలో వీరి పాత్ర కూడా ఉండడంతో దీనిపై కూడా అధికారులు విచారిస్తున్నారు.

మహిళలకు సకాలంలో రుణాలు

నెల్లూరు(పొగతోట) : స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు రెండు రోజుల్లో రుణాలు మంజూరు చేసేలా బ్యాంకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి కోరారు. నగరంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం వివిధ బ్యాంకుల అధికారులు, డీఆర్‌డీఏ ఉద్యోగులతో పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవైలపై నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ఎస్‌హెచ్‌జీలకు సంబంధించిన పొదుపు నగదు తీసుకోవడంలో ఇబ్బందులు పెడితే మహిళలతో కలిసి బ్యాంకు ఎదుట ధర్నాకు దిగుతామన్నారు. బ్యాంకు అధికారులు సకాలంలో మహిళలకు రుణాలు మంజూరు చేసి వారు సూక్ష్మ రుణాల సంస్థల ఊబిలో పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. బీమాకు సంబంధించిన క్లైమ్స్ 30 రోజుల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలందరూ బీమాకు సంబంధించి ప్రతి ఏడాది రెన్యూవల్ చేసేలా చర్యలు చేపడుతామన్నారు. జగనన్న తోడు పథకానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రూపునకు రూ.20 లక్షలు, వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీపీఎంలు మంజుల, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

40 మంది కానిస్టేబుల్స్‌కు పదోన్నతులు



నెల్లూరు సిటీ : ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్సైజ్, ఎస్‌ఈబీ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న 40 మంది కానిస్టేబుల్స్‌కు హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతులు కల్పిస్తూ ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటరామిరెడ్డి బుధవారం నియామక పత్రాలు అందజేశారు. పదోన్నతులు పొందిన వారిలో 1985 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు, 1995 బ్యాచ్‌కు చెందిన 38 మంది ఉన్నారు. త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

సంగం : మండలం గాంధీజనసంఘంలో యువతి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. గాంధీజనసంఘానికి చెందిన చేవూరి శ్రీహరి నాగమణి దంపతుల రెండో సంతానం సుమిత్ర(19). ఇటీవల ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసింది. ఈ క్రమంలో గత నాలుగు రోజులుగా మౌనంగా ఉంటున్న సుమిత్ర మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో రేకులకు ఉన్న ఇనుపరాడ్డుకు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు సుమిత్రను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. డాక్టర్ల సలహా మేరకు నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచి ధర ఇవ్వాలి

కందుకూరు : రైతులకు గిట్టుబాటు ధరలు ఇచ్చేందుకు వ్యాపారులు ప్రాధాన్యం ఇవ్వాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు సూచించారు. కందుకూరులోని ఒకటి, రెండు పొగాకు వేలం కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉందని, ధర కూడా బాగుందన్నారు. పండించిన పొగాను వేలం కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. అనంతరం లింగసముద్రం మండలం విశ్వనాథపురంలో నిర్మించిన లూజ్ లీఫ్ బ్యారన్‌ను ప్రారంభించారు. రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 123
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 136

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30